
# ప్రజాప్రతినిధి!



— ఆలపాటి లక్ష్మీనరసింహారావు

మంత్రివర్గం రాజీనామా చేసింది. అసెంబ్లీ రద్దయింది. మధ్యంతర ఎన్నికలు తప్పవంటూ రూఢి అయింది. ఎన్నికల తేదీ ప్రకటించక ముందే అన్ని పార్టీలు తమ అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలనే కృతనిశ్చయంతో వున్నాయి. గత అనుభవం వాళ్ళకీ గుణపాఠం నేర్పింది.

పోయినసారి నామినేషన్ల చివరి రోజున కూడా అభ్యర్థులను నిర్ణయించడంతో కొంత మంది నామినేషన్ వేయలేకపోయారు. వేసిన వారికి కూడా ప్రచారం చేసుకోవడానికి గ్రామాల్లో గోడలు కరువయ్యాయి. కటౌట్లు యేర్పాటు చేయడానికి అనువైన స్థలం దొరకలేదు. పోస్టర్లు ప్రింటు వేసుకోవడానికి ప్రెస్సులు అందు బాటులో లేకపోయాయి. తమకు సంబంధించిన కార్యకర్తలను అవతలివారు కొనుగోలు చేశారు. జీపులు, లారీలు, ట్రాక్టర్లకు కోరినంత కిరాయి యిచ్చుకొని కాళ్ళా గడ్డం పట్టుకోవలసి వచ్చింది. ఇట్లా చెప్పుకోవాలంటే సవాలక్ష కష్టాలు పడవలసి వచ్చింది. అందుకే ముందుగానే మేల్కొన్నారు.

ప్రజాప్రతినిధులుగా పోటీ చేద్దామనే ఉబలాటం గలవారు కిరాయి బస్సుల్లో మందీమార్బలాన్ని వెంటేసుకుని రాజధానికి విచ్చేశారు. నాయకులకు చెప్పించడాలు, బలప్రదర్శనలు, జైజై నినాదాలు కొనసాగాయి. హోటళ్ళకు గిరాకీ పెరిగింది. సినిమా హాళ్ళ ముందు టిక్కెట్ల బ్లాకు రేటు ఊపందుకున్నది. చోపుదారులు, హంగుదారులతో రోడ్లు కళ కళలాడసాగాయి. లాడ్జింగుల్లో ఖాళీలేక వాపలకు గిరాకీ హెచ్చింది. పార్టీ ఆఫీసుల్లో నిలబడడానికి కూడా చోటులేక ఆవరణలోని చెట్ల క్రింద, గోడల నీడల్లో కాబోయే అభ్యర్థులు ఎదురుతెన్నులు చూడసాగారు.

పార్టీ నాయకుడికి క్షణం తిరుబాటు లేదు. నిద్రాహారాలు లేవు. ముఖం మీద అలసట స్పష్టంగా కనిపిస్తూనే వుంది. అయినా అతగాడికి ఆనందంగానే వుంది. రాష్ట్రంలోని నాలుగు చెరగుల నుండి తెలిసినవారూ, తెలవనివారూ సముద్రంలా హోరెత్తిస్తో వచ్చి వినయ విధేయతలతో మనవులు చేసుకుంటో వుంటే విని యెన్నాళ్ళయింది? తర తమ భేదం లేకుండా పెద్దలూ చిన్నలూ నమస్కారాలు చేస్తోంటే ఆయనగారి హృదయం చక్కిలిగింతలతో పరవశించి పోతోంది.

నాయకుడికి సంయమనం తక్కువ. చికాకు ఎక్కువ. వినే గుణం తక్కువ. మాట్లాడే గుణం ఎక్కువ. నాలుగు రోజులపాటు తన నైజగుణాలను పక్కకు పెట్టి, వచ్చినవాళ్ళు చెప్పింది ఓపికగా వినడం, సౌమ్యంగా మాట్లాడడం నేర్చుకున్నాడు. కాబోయే ప్రతినిధులను ఎన్నుకోవడానికి ప్రత్యేకంగా కమిటీ వున్నది. అయితే, నాయకుడి ఇష్టమే అందులోని అందరి యిష్టమూ!

పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

10-5-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

## తెల్లమచ్చలు

కొత్త పరిశోధన! తెల్లమచ్చలు, ఇతర చర్మవ్యాధులు వున్నవాళ్ళు బాధపడనవసరంలేదు. అట్టివాటి వివరాలు ఇంగ్లీషులో తెలిపి, రెండు చిన్న సీసాల మందు ఉచితంగా పొందండి. మా మందు వాడడం మీరు ప్రారంభించగానే మీ తెల్లమచ్చలు మాయమవడం ప్రారంభమగును. చాలా మంది ఈ విధమైన నివారణ పొందారు. మీరూ ప్రయత్నించి లాభం పొందండి. అర్హతలు, అనుభవం వున్న వైద్యుని ద్వారా చికిత్స పొందండి.

## తెల్లవెంట్రుకలు

హేర్ డైతో కాదు, మా ఆయుర్వేద నూనెతో చిన్న వయస్సులో వెంట్రుకలు తెల్లపడడం ఆటంకపర్చవచ్చును. మొదలునుండే నల్లజుట్టు రావడం మొదలై, జుట్టుని తెల్లపడనీయకుండా కాపాడును. ఈ నూనె కళ్ళకి, మెదడునకు లాభదాయకమైనది. వేల మంది లాభం పొందారు. ఈ చికిత్స ద్వారా మీకు ఫలితం దక్కనిచో, మీ డబ్బు వాపస్ ఇవ్వబడును. ఒకసారి ప్రయత్నించండి.

ఒక చిన్న సీసా వెల రూ. 14/-

మూడు సీసాల వెల రూ. 40/-

మూడు సీసాలకి ఒకేసారి ఆర్డర్ ఇస్తే ఒక సీసా ఉచితం.

**Vaidya B.H. Mathur (B.H.J.)**

P.O: Katri Sarai

(Gaya)


'ఇంటర్వ్యూ'లు మొదలయ్యాయి. నాయకుడి పిలుపు కోసం చాతక పక్షుల్లా అందరూ ఎదురుచూస్తున్నారు. పార్టీ కార్యాలయం లోపలా వెలుపలా కార్లూ, స్కూటర్లూ, మోటారు సైకిళ్ళూ పార్కు చేసి వున్నాయి. విషయం తెలవనివారు సాలా పాటలేమోననుకొని వచ్చి, చూసి పోతున్నారు. 'సందడిలో సడేమియా' అంటూ విలేకరుల గోకుడు "మీరు ఎన్నికయితే యేమి చేస్తారంటూ?".. వాళ్ళకు తెలవకనా- నాయకుడు ఎట్లా చెబితే అట్లా చేతులెత్తడమే నాయె...

అదొక దేవాలయం. లోపల నున్నవాడో దేవుడు. బయట వున్నవారు భక్తులు. భక్తులకూ భగవంతుడికీ మధ్యన మహాద్వారం. ద్వారం ముందు నిలబడిన పార్టీ కార్యకర్త వచ్చిన చీటీని చూసుకుని ఒక్కొక్కరినీ పిలుస్తున్నాడు. పిలుపునందుకున్నవాడు చిరునవ్వుతో అందరినీ చూచి లోపలికి వెళ్ళి వస్తున్నాడు. బయటికి వచ్చేవారి మొఖాల్లో రకరకాల రంగులు- షోడశ కళలు.

ఠీవిగా మీటరు బద్ద మింగినట్లు నడుస్తో వచ్చి అనుయాయులను కావిలించుకొని 'జై'లు కొట్టించుకునేవారు కొందరు. చిరుబురులాడుతో వచ్చి చిందులు వేస్తో వెళ్ళిపోతోన్నవారు కొందరు. "ఇదిగాకపోతే మరో పార్టీ" అనే రీతిలో ధాటిగా వచ్చి స్వగృహ ప్రవేశానికి టాక్సీని తరలిస్తోన్నవారు మరి కొందరు. నీరసంగా భూమిలో బంగారాన్ని వెతుకుతోన్నట్లు వచ్చి "పార్టీకి చేసిన సేవ- శవానికి చేసిన సంస్కార"మంటూ జ్ఞానోదయంతో వైరాగ్య శతకం చదివేవారు... మహానుభావులు- పోతున్నారు, వస్తున్నారు.

చెట్టుకింద నీడలో సొంత కుర్చీ వేసుకు కూర్చున్న వ్యక్తి మట్టూ అందరి చూపులూ ప్రదక్షిణం చేశాయి. కూర్చున్నవాడు కుర్చీ నిండుగా వున్నాడు. వేళ్ళకు ఉంగరాలున్నాయి. మెళ్ళో బంగారపు గొలుసుంది. కోరమీసాలున్నాయి. ఎడం చేత్తో మధ్య మధ్య మీసాన్ని మెలివేస్తున్నాడు. టిక్కెట్టు నాకు కాకపోతే మరెవరికిస్తారనే ధీమా ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అంతా వింతగాచూడసాగారు.

ఉంగరాల మనిషి కొత్తవాడిలా వున్నాడు. సొంత కుర్చీ తెచ్చుకున్నాడు. ముక్కుసూటిగా మాట్లాడుతున్నాడు. ఎవడినీ లెక్కచేసే బాపతుగా లేడు. డబ్బు ఉన్నవాడిలాగానే వున్నాడు. రాజకీయం బొత్తిగా తెలవనివాడు. ఎట్లా బతుకుతాడో యేమో? ఇతగాడికి టిక్కెట్టు వస్తుందా?- రాదంటే రాదని తీర్మానించుకున్నారందరూ.

విలేకరుల దృష్టి మీసాల మనిషిమీద పడింది. అంతా అపురూపంగా చూసి "రాజకీయాల్లోకి కొత్త రక్తం వస్తోంది" అనుకున్నారు. వారికీ వ్యక్తి యింతవరకు యే పార్టీలో కనిపించలా- అసెంబ్లీ సరిహద్దుల్లో తారసపడలా- ఎక్కడా ఉపన్యాసాలు చెప్పలా- "పేపర్‌కు మేటర్ దొరికింది" అంటూ సంబరపడుతూ మట్టూ మూగి ప్రశ్నలు మొదలుపెట్టారు. వాళ్ళ దురదృష్టం- అతగాడికి పిలుపు వచ్చింది. లోపలికి వెళ్ళిపోయాడు.

ఎయిర్‌కండిషన్ గది నిశ్శబ్దంగా వుంది. నేల నిండుగా తివాచీ పరిచి వుంది. గోడలకు వ్రేళ్ళాడుతూ ఖరీదైన అపురూప వస్తువులు...

సోఫాలో నాయకుడు వచ్చినవాళ్ళు దణ్ణం పెట్టుకోవడానికనువుగా కాళ్ళు చాపుకొని కూర్చున్నాడు. ఆయన మొఖం గంభీరంగా వుంది. ఎదురుగా పెడా కుర్చీలలో ఎలక్షను కమిటీ సభ్యులు నలుగురు...

ఉంగరాల మనిషి కుర్చీ లాక్కుని కూర్చుని "నమస్కారం" అన్నాడు చేతులు జోడించకుండానే.

నాయకుడికి కోపం వచ్చింది. క్షణ కాలం భ్రుకుటి ముడిపడి విడిపోయింది. వచ్చినవాడు కాళ్ళకి మొక్కలేదు. కూర్చోమనకుండానే కూర్చున్నాడు కుర్చీని బర్రున లాగి. అయినా తమాయించుకున్నాడు మెళ్ళో గొలుసు, వ్రేళ్ళ ఉంగరాలు లెక్కపెడుతూ..

ఫైలు చూస్తోన్న కమిటీ మెంబరు "మీ పేరు భుజంగరావా?" అన్నాడు.

భుజంగరావు మాట్లాడలేదు.

"మీకు ఎన్నికలలో పోటీ చేయాలనే కోరిక ఎందుకు కలిగింది?"- రెండో మెంబరు అడిగాడు.

"నా నియోజకవర్గం ప్రజలందరూ నిలబడమని ఒకటే గొడవ- పోనీలే ప్రజాసేవ చేద్దామని పనుల్నీ మానుకొని వచ్చాను"- మీసాన్ని మెలివేస్తూ చెప్పాడు భుజంగరావు.

"ప్రజలంటే ఎవరు?"

"ఇంకెవరు?- నా పెళ్ళాం- పిల్లలు- మా చిన్న బామ్మర్ది మల్లేశం. మా బాబాయి కొడుకు


ప్రతిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

మోహనావు. నాతో గోరీలాడిన యారభద్రం.. మన యమ్మెల్యేలకి ప్రజలంటే ఎవరు? వీళ్ళే కదా!''

''నీకున్న అనుభవం ఏమిటి?''- నాయకుడు గంభీరంగా అడిగాడు.

''ఎవరికి?''

''నీకే..''

భుజంగరావుకి కోపం వచ్చింది. నాయకుడికి మర్యాద తెలవదు. పెద్దమనిషిని పట్టుకుని ''నీవం టున్నాడు'' అనుకున్నాడు. నాయకుడి తీరు అది. అతడి దృష్టిలో తాను తప్ప మర్యాదస్తులు మరొకరు లేరు. ఈ విషయం భుజంగరావుకు తెలవదు.

...''పెళ్ళి చేసుకున్న పెళ్ళాం- నేను లేపుకొచ్చింది ఒకతి- నన్ను లేపుకపోయింది ఒకతి- మొత్తం ముగ్గురు. లెక్కలోకి వచ్చేవారు నలుగురు మొగవాళ్ళు. ఆరుగురు ఆడపిల్లలు. వివరంగా చెప్పాలంటే..'' భుజంగరావు మళ్ళీ మీసం మెలిపెట్టాడు.

''ఆ అనుభవం కాదు. మీకు వ్యాపారంలో అనుభవం వుందా? ఉద్యోగంలో అనుభవం వుందా? లేకపోతే దేనిలో అనుభవం వుందో - అది - దాన్నడుగుతున్నారు'' వివరించి చెప్పాడు మెంబరు.

భుజంగరావు మట్టూ అనుమానంగా చూశాడు. నాయకుడినీ, మెంబర్లనూ మార్చి మార్చి చూస్తూ''చెప్పనా? వద్దా'' అనే భావం వెలిబుచ్చాడు.

''మీకేం భయం లేదు. ఇక్కడ ఎవరూ లేరు. మీరు చెప్పిన విషయాలు గోప్యంగా వుంచబడతాయి'' అభయం ఇచ్చాడు కమిటీ మెంబరు.

''చదువుకునే రోజుల్లో కాలేజీ ప్రెసిడెంటు నయ్యాను. లెక్చరర్లు, ప్రిన్సిపాల్ నన్ను చూసి వణికే వాళ్ళు. ఎదుటి పార్టీ వాళ్ళ లీడర్లు గంగలో కలిసిపోయారు. ఇప్పుడు నా నియోజక వర్గంలో నాకెదురులేదు. ఎదురు తిరిగిన వాడు భూమి మీద వుండడు. నా మనుషుల్తో యేపని అయినా జరిగిపోద్ది. బస్సు దోపిడీలలో మనకి వాటా వుంది. సిటీలో ముం... కంపెనీలన్నీ నావే. బిచ్చగాళ్ళందరూ మన అండదండల్లో వారే. చెప్పాలంటే చాలా వున్నాయి. ఏ సెక్షనుకు అదే.''

''ఆస్తిపాస్తులేమయినా సంపాదించారా? ఎంత వుండవచ్చు?''

''ఈ విషయం తెలుసుకోవడం అవసరమా?''- భుజంగ రావు అనుమానంగా అడిగాడు.

''అవసరమే- ముందు ముందు ప్రజా జీవితంలోకి అడుగుపెడుతున్నవారాయె- అన్ని విషయాలూ పార్టీకి తెలిసి వుండాలి.''

''అయితే చెబుతా- ముందు మీ కెంతంత వున్నదో చెప్పండి?''

''నాయకుడిని అటువంటి ప్రశ్నలు అడగకూడదు. -తప్పు- పార్టీ క్రమశిక్షణకు విరుద్ధం. అయినా వారికి ఆస్తియేమీ లేదు.''

''నాకు కూడా యేమీ లేదు- టిక్కెట్టు రాగానే పెళ్ళాం పిల్లల పేరున పెడతాను. గెలిచాక తెల్ల కాయితం మీద రాసి సీల్డు కవరులో పెట్టి ఇస్తాను.''

కమిటీ మెంబరుకు పచ్చివెలగ కాయ తిన్నట్టయింది. అతడి సర్వీసులో మొదటిసారి చూస్తోన్న కేసు ఇది. నాయకుడి వైపుకు తిరిగి ''ఏం చేద్దాం?'' అన్నట్టుగా చూశాడు. నాయకుడు తర్వాత ప్రశ్న అడగమన్నట్టు సైగ చేశాడు.

''మీ మీద పోలీసు కేసులేమైనా వున్నాయా?''

''మూడు రేపులు- నాలుగు హత్యలు- ఐదు కిడ్నాపులు - పధ్నాలుగు దొమ్మీలు''- చాలా ఇంకేమైనా కావాలా? అన్నట్లు చూశాడు భుజంగరావు.

''మీకు మైకులు విరగగొట్టడం వచ్చునా?''

''రాదు. మనుషులను విరగదియ్యగలను.''

''పది మంది ముందూ నెత్తురు కక్కేటట్టు మనిషిని తొక్కేయగలరా?''

''రాదు'' అంటూ భుజంగరావు జేబులో నుండి బటన్ చాకు తీసి, మీట నొక్కి, మళ్ళీ మూసి జేబులో పెట్టేసుకున్నాడు.

''బస్సులు తగలబెట్టడం - బ్యాలెట్ బాక్సులు ఎత్తుకుపోవడం- బాంబులు విసరడం - గూడేలు తగలబెట్టడం లాంటివి చేయగలరా?''

''పోరగాళ్ళు చేసేవి నాకు చెప్పి పరువు తీయొద్దు. అయినా ఇవన్నీ యమ్మెల్లేకి కావాలా? ఉల్ఫా గాళ్ళు చేసే పనులు. నాకు చెప్పేవి నాకు చెప్పండి. ఎవడినన్నా లేపెయ్యాలో? దేన్నన్నా లేపుకు రావాలా? తలలు మార్చాలా? తంపులు పెట్టాలా?- ఏం చేయాలి?'' భుజంగరావు ఉడుక్కున్నాడు.

''కులం -కులం దగ్గర మీరు ఖాళీ వదిలిపెట్టారు''- మెంబరు అడిగాడు.

''ఇదెందుకు?''- భుజంగరావుకు కోపం వచ్చింది.''కులాన్ని బట్టి సీటిస్తారా?'' అన్నాడు.

''ఒకటి రెండు సీట్లు అందరికీ పంచాలి. లేకపోతే కులాభిమానమంటారు.'' భుజంగ రావు కులం పేరు చెప్పాడు.

''చివరిసారిగా అడుగుతున్నాము. నీకు సీటు ఇస్తే పార్టీకి నీవు యేమి ఇవ్వగలవు?''

''నా ఖర్చు నేను పెట్టుకుంటా - గెలిచిన తరువాత మీరు చెప్పినట్లు వింటా -మంత్రి పదవి ఇస్తే వాటా ఇస్తా. ఇన్నీ చేస్తే పార్టీ నాకేం చేయగలదు?''

''ప్రశ్నలు నువ్వు అడగకూడదు. మేమే అడగాలి. నిజంగా చెప్పు. దేనిని ఆశించి నువ్వు ఎమ్మెల్లే కావాలనుకుంటున్నావు?''

''నిజం చెప్పమన్నారు కాబట్టి చెబుతున్నాను. కష్టపడి ఇప్పుడు సంపాదిస్తున్న దానికంటే తేలికగా ఎక్కువ సంపాదించవచ్చని...''

భుజంగరావును వెళ్ళమన్నారు. భుజంగరావు గడప దాటబోతున్నవాడు కాస్తా నాయకుడు 'పెండింగ్' అంటోన్న మాట విని వెనుకకు తిరిగి వచ్చాడు.

''మళ్ళీ ఎందుకు వచ్చాడా?'' అంటూ అంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

భుజంగరావు నాయకుడి కళ్ళలోకి సూటిగా చూస్తూ ''బాగా ఆలోచించుకో అవతల పార్టీ వాళ్ళు బతిమిలాడినా ఇక్కడికి వచ్చింది ఎందుకనుకున్నావు? వాళ్ళు ఒట్టి పప్పు దప్పళం గాళ్ళు. మనమో నాన్ వెజ్! అవకాశం ఇస్తావని వచ్చాను. లేకపోతే అటు రేపే చేరి అందరినీ 'నాన్ వెజ్'గా మారుస్తాను...'' ఉరుముతూ వెళ్ళిపోయాడు.

శివిగా స్వర్గాన్ని జయించినట్లు తిరిగి వచ్చిన భుజంగరావు మట్టూ జనం మూగి ఒళ్ళంతా తడమ సాగారు. ఒకరిద్దరు మెడలో గొలుసునీ, వేళ్ళకు వున్న వుంగరాలనీ కూడా...

విలేకరులు సామాన్యులు కారు. భుజంగరావు రాకను పసిగట్టి మట్టూ మూగి రకరకాల ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. భుజంగరావేమీ తక్కువ తినలేదు. అవసరమైనంత వరకే మాట్లాడాడు.

చివరిగా ఒక విలేకరి కొంటెగా భుజంగరావుని చూస్తూ ''మీ సంభాషణలను వారు టేప్ చేశారు. బ్లాక్ మెయిల్ చేస్తే యేం చేస్తారు?'' అన్నాడు.

భుజంగరావు చిరునవ్వు నవ్వి మీసాన్ని మెలివేస్తూ ''నేనేం తక్కువ తినలేదు. మిమిక్రీ ఆర్టిస్టుని. రికార్డ్ 'ఆన్' చేస్తే మాట్లాడేది నాయకుడే...''

అంతా ''ఆ' అంటూ నోళ్ళు వెళ్ళబెట్టారు